క్లుప్తంగా

అనారోగ్యంతో 'సాధన' సభ్యుడి మృతి


నల్లి ఉమాశంకర్ (ఫైల్)

నెల్లిమర్ల: మండలంలోని జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘ సభ్యుడు నల్లి ఉమాశంకర్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన కొన్నాళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. సాధన యువజన సంఘంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, ఎంతోమందికి సేవలు అందించారు. ఉమాశంకర్ మృతి పట్ల సంఘ సభ్యులు, పెద్దలు సంతాపం వ్యక్తం చేశారు.

సీసీ కెమెరాలు కీలకం..


పెదతాడివాడ రామాలయం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్సై సన్యాసినాయుడు

డెంకాడ: నేర పరిశోధనలో సీసీ కెమెరాలు చాలా కీలకమని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని పెదతాడివాడ రామాలయం వద్ద.. మోదవలస ఎస్సీ కాలనీలో సోమవారం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారులు తమ దుకాణాల వద్ద కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరస్తులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, తదితరులు

డెంకాడ: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని రకాల చర్యలు చేపట్టామని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండలంలోని వెదుళ్లవలస పంచాయతీలోని గొడిపాలెం గ్రామంలో కొత్తగా వేసిన బోరును సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చింనాయుడు, పినతాడివాడ మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బీమా పరిహారం జమచేయడంలో నిర్లక్ష్యం


బాధితురాలు ఈశ్వరమ్మ

విజయనగరం అర్బన్: శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వివరాల్లోకి వెళితే.. వేపాడ మండలం వీలుపర్తి గ్రామానికి చెందిన పత్రి నాయుడుబాబు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో డీఆర్‌డీఏ శాఖ ద్వారా చేరాడు. అనంతరం 2022 అక్టోబర్ 13న ఆయన మృతి చెందడంతో భార్య ఈశ్వరమ్మకు 2024 మార్చి 11న బీమా సంస్థ రెండు లక్షల రూపాయల పరిహారం చెక్ మంజూరు చేసింది. వేపాడలోని విశాఖ గ్రామీణ బ్యాంక్‌లో చెక్ క్లియర్ చేసుకోవాలని అధికారులు సూచించారు. దీంతో ఆమె బ్యాంక్ అధికారులకు చెక్ ఇచ్చి తన ఖాతాకు నగదు ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరింది. అయితే అదే బ్యాంక్‌లో ఈశ్వరమ్మ అత్తకు రుణం ఉండడంతో అది తీరిస్తే గాని చెక్ క్లియర్ చేయమని బ్యాంక్ అధికారులు చెప్పడంతో బాధితురాలు ఊసురోమంటూ డీఆర్‌డీఏ అధికారులను కలిసి సమస్య వివరించింది. అయితే బీమా కట్టించడం వరకే మా పని.. బ్యాంకర్లు డబ్బులు ఇవ్వకపోతే మేమేం చేస్తామంటూ వారు బదులిచ్చా రు. నెలల తరబడి తిరుగుతున్నా నగదు జమ కాకపోవడంపై బాధితురాలు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసింది.

ఘనంగా ఉరుసు ఉత్సవం



చీపురుపల్లి: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని రుంకానవీధిలో ఉన్న దత్తసాయి మందిరంలో రాజమండ్రికి చెందిన ముస్లింలతో ఆదివారం సాయంత్రం ఉరుసు (చందనోత్సవం) ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దత్తసాయి మందిర నిర్వాహకుడు తంగుడు రామకృష్ణ ఆధ్వర్యంలో షిర్డీ సాయి బాబా విగ్రహానికి చందనం పూయడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే షిర్డీ సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.వేడుకల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరాల ఊసేదీ..?


ఆటలాడుతున్న క్రీడాకారులు (ఫైల్)

- ప్రతి ఏటా నెల రోజుల పాటు నిర్వహిస్తోన్న శాప్
- ఈ ఏడాది శిబిరాల నిర్వహణపై డీఎస్‌ఏకు అందని సమాచారం
- శాప్ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామంటున్న అధికారులు
- క్రీడా శిబిరాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న క్రీడాకారులు

విజయనగరం: క్రీడల్లో రాణించాలంటే విద్యార్థి దశ ఎంతో కీలకం. 8 నుంచి 14 సంవత్సరాల్లోపు వయసున్న వారు తమకి ఆసక్తి ఉన్న రంగంలో పరిణితి సాధించేందుకు ముఖ్యమైన సమయమిదే. ఈ నేపథ్యంలో ఏడాది మొత్తం పుస్తకాలతో కుస్తీలు పట్టే విద్యార్థులు తమకిష్టమైన క్రీడల్లో రాణించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వేసవిలో నిర్వహించే ఉచిత క్రీడా శిక్షణ శిబిరాల వైపు చూస్తుంటారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది సమీపిస్తున్న తరుణంలో ఈ ఏడాది వేసవి క్రీడా శిబిరాల నిర్వహణపై ఎటువంటి ప్రణాళికలు సిద్ధం చేయకపోవడం గమనార్హం. జిల్లా క్రీడాప్రాధికార సంస్థలకు ఎటువంటి సమాచారం రాకపోవడంతో ఈ ఏడాది వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తారా..? లేదా...? అన్న సందిగ్ధత క్రీడాభిమానుల్లో నెలకొంది.

పరీక్షలు పూర్తవుతున్నా..

పదో తరగతి, ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. విద్యార్థులకు కాస్త ఆటవిడుపు దొరికింది. మరోవైపు విద్యాసంవత్సరం ముగింపు దశకొచ్చింది. మిగిలిన విద్యార్థులకు సైతం ఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయి. వేసవి సెలవుల్లో ఆటపాటల్లో పట్టు పెంచుకునేందుకు బాలలంతా ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. కానీ జిల్లా యంత్రాంగం ఇంతవరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఊసే ఎత్తడం లేదు. వాస్తవానికి ఏటా వేసవిలో బాల, బాలికల్లో ఉండే క్రీడాసక్తిని గమనించి శిక్షణ శిబిరాలు నిర్వహించడం ఆనవాయితీ. వీటి నిర్వహణ బాధ్యతను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ తీసుకుంటుంది. అయితే ఈ ఏడాది మైదానాల ఏర్పాటు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించే కార్యక్రమాలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. వేసవిలో మే 1 నుంచి 31 వరకు ఈ శిక్షణ శిబిరాలు నిర్వహించాలి. జిల్లాలో 50 శిబిరాలు కచ్చితంగా జరపాలి. 8 – 14 ఏళ్ల మధ్య ఉండే బాల, బాలికలకు వీటిలో ప్రవేశం ఉంటుంది. ఈ శిబిరాల్లో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి భవిష్యత్‌లో మరింత తర్ఫీదు అందించాల్సి ఉంటుంది. అయితే శిక్షణ శిబిరాలపై ఇంతవరకు శాప్ ఎలాంటి ఉత్తర్వులు విడుదల చేయకపోవడం విశేషం.

ఇలా నిర్వహించాలి..

శిబిరాల్లో పాల్గొనే క్రీడాకారులకు కావాల్సిన ఉపకరణాలు అందించాలి. వీటి నిర్వహణ బాధ్యతలను ఎంపిక చేసిన క్రీడా సంఘాలు, సీనియర్ క్రీడాకారులు, శిక్షకులకు అప్పగించాలి. ప్రతి శిబిరానికీ ఖర్చులకు రూ.10 వేలు అందిస్తుంటారు. ఇందులోనే క్రీడా సామగ్రి, శిక్షకుడికి గౌరవ వేతనం, మైదానం ఖర్చులు చూసుకోవాల్సి ఉంటుంది.

తప్పని ఎదురుచూపులు..

ఈ ఏడాది ఎప్పుడెప్పుడు వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభిస్తారా అని విద్యార్థులు, క్రీడాకారులు ఎదురుచూస్తున్నారు. సాధారణంగా ఏటా ఏప్రిల్ చివరివారం లేని పక్షంలో మే మొదటి వారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తారు. ప్రాంతాల వారీగా ఏ క్రీడలో విద్యార్థులకు ఆసక్తి ఉందో గుర్తించి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో తర్ఫీదు ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేస్తారు. ఇటీవల కాలంలో విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెరుగుతోంది. పలువురు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ మిగిలిన క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, టెన్నిస్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, హాకీ, టెన్నీకాయిట్‌లో రాణించిన క్రీడాకారులు ఎక్కువగా ఉన్నారు. ఈ విజేతలను స్ఫూర్తిగా తీసుకుని మరింతమంది ఆయా క్రీడల్లో రాణించాలని ఆశపడుతున్నారు. కానీ శిక్షణ ప్రభుత్వం శిక్షణ శిబిరాల ఊసెత్తకపోవడం వారిని నిరాశపరుస్తోంది.

ఆదేశాలు వచ్చిన వెంటనే..



ఈనెల రెండో వారంలో ఆదేశాలు వెలువడే అవకాశం ఉంది. గతేడాది ఎన్నికల వల్ల వేసవి క్రీడా శిక్షణ తరగతులు నిర్వహించలేదు. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వీటిని ఏర్పాటు చేసి విద్యార్థులు, క్రీడాకారులకు తర్ఫీదు ఇస్తాం.

– ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి, విజయనగరం

పన్ను రాయితీ పథకానికి స్పందన


ముందస్తు పన్ను చెల్లించేందుకు వచ్చిన భవన యజమానులు

విజయనగరం: ఎటువంటి పాత బకాయిలు లేకుండా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్ను మొత్తం ఒకేసారి చెల్లించేవారికి మున్సిపల్ శాఖ ప్రకటించిన ఐదు శాతం పన్ను రాయితీ పథకానికి స్పందన లభిస్తోంది. 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లలో భాగంగా ప్రకటించిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు భవన యజమానులు ముందుకు వస్తున్నారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక కౌంటర్ల వద్ద సోమవారం రద్దీ వాతావరణం కనిపించింది. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి గాను పన్ను మొత్తాన్ని ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించినట్లయితే ప్రభుత్వం ఐదు శాతం రాయితీని ప్రకటించిందన్నారు. ఈ విషయమై విస్తృత ప్రచారం కల్పించామన్నారు. ఐదు శాతం రాయితీ ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా కూడా పన్నులు చెల్లించుకునే వెసులుబాటు ఉందని చెప్పారు. అదేవిధంగా బకాయిలు ఉన్న వారు కూడా తక్షణమే పన్నులు చెల్లించాలని కోరారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య


ఆక్రమణలపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రభుత్వ స్థలాలు, రహదారులను ఆక్రమిస్తే చర్యలు తప్పవని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో సోమవారం పర్యటించి, అనధికార నిర్మాణాలను గుర్తించి తక్షణమే తొలగించి వేయాలని ప్రణాళిక అధికారులకు ఆదేశించారు. వివిధ ప్రాంతాలలో గుర్తించిన అనధికార దుకాణాలను కూడా తొలగించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. నగర క్రమబద్ధీకరణలో భాగంగా చేపడుతున్న చర్యలకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టౌన్ సర్వేయర్ సింహాచలం , తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ

- కమిషనర్ పల్లి నల్లనయ్య


సమావేశానికి హాజరైన ప్రజారోగ్య విభాగ సిబ్బంది (ఇన్‌సెట్లో) కమిషనర్

విజయనగరం: నగరంలో మరింత మెరుగ్గా పారిశుధ్య పనులు చేపట్టాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజారోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో కుక్కలకు శస్త్రచికిత్సలు, యాంటీ రేబిస్ టీకాలు శతశాతం జరిపించాల్సిందేనని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర నేపథ్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. హోం కంపోస్ట్ విధానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. నీటి నిల్వల వద్ద యాంటీ లార్వా ఆపరేషన్ ప్రక్రియలను చేపట్టాలని సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేసి మెరుగైన ఫలితాలు తీసుకురావాలన్నారు. సమావేశంలో పారిశుధ్య పర్యవేక్షకులు, మేస్త్రీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి


ఆర్‌ఐ వీవీ రాజుకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, వీఆర్‌ఏల యూనియన్ నాయకులు

విజయనగరం గంటస్తంభం: వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు మండల ఆర్‌ఐ వీవీ రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి, సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ.జగన్ మోహనరావు మాట్లాడుతూ.. గ్రామ రెవెన్యూ సహాయకులుగా పైకి విధులు నిర్వహిస్తూ, అంతర్గతంగా ఆఫీస్‌లో అటెండర్లుగా, స్వీపర్లుగా, డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.అటువంటి వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. వీఆర్‌ఏలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అలాగే అర్హులైన వారికి ప్రమోషన్, నైట్‌డ్యూటీల రద్దు, జీతంతో కలిసి డీఏలను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, పైడిరాజు, జయరాజు, రాములప్పుడు, వీరస్వామి, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు


ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యంగా ఉండడం కోసం ప్రతిరోజూ వ్యాయమం చేయడంతో పాటు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్. అప్పలనాయుడు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో గడపాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ పీఏ రమణి, డాక్టర్ జి. వెంకటనాయుడు, డాక్టర్ శివకుమార్, డాక్టర్ బి. సంతోష్‌కుమార్, డాక్టర్ రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోనే కోచింగ్..

- మంత్రి కొండపల్లికి ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగుల వినతి

విజయగరం అర్బన్: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోనే డీఎస్సీ కోచింగ్ ఇవ్వాలని పలువురు నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సంక్షేమ శాఖ అధికారులు జిల్లా కేంద్రంలోని శిక్షణ కేంద్రానికి కాకుండా దూర ప్రాంతాల్లోని కేంద్రాలకు నిరుద్యోగ అభ్యర్థులను పంపిస్తున్నారని చెప్పారు. జిల్లా కేంద్రంలోని సెంటర్‌లో 350 మందికి శిక్షణ ఇచ్చే అవకాశం ఉన్నా..జిల్లాకు చెందిన అభ్యర్థులను ఇతర ప్రాంతాలకు పంపించడం సరికాదన్నారు. జిల్లాకు చెందిన అభ్యర్థులకు స్థానికంగా శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జి.బంగారురాజు, ఎస్.సింహాచలం, వై.అప్పారావు, టి.ప్రసాద్, జె.శ్రీనివాసరావు, తదితరులున్నారు.

నేడు సత్య కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

విజయనగరం అర్బన్: పట్టణంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో హెటిరో ల్యాబ్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు మంగళవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొడక్షన్ విభాగం పోస్టులకు బీఎస్సీ అన్ని గ్రూప్‌ల విద్యార్థులు, బీకాం, బీఏ పాసైన, ప్రస్తుతం ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. క్యూసీ, క్యూ ఏ విభాగం పోస్టులకు ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ వారు అర్హులని తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రికల విభాగంలో ఐటీఐ (2021 నుంచి 2024 మధ్యలో పూర్తి చేసిన) విద్యార్థులు అర్హులన్నారు. ఉదయం 9 గంటలకు పూర్తి బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. పేర్ల నమోదుకు 70123 93316, 90327 72661 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు గాయత్రి డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో బుధవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కె.నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అరబిందో, న్యూ ల్యాండ్, గ్రాన్యూల్స్ ఫార్మాకు చెందిన కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు..

మండుటెండల్లో ప్రయాణిస్తున్న వారి దాహార్తిని తీర్చేందుకు మండలంలోని పినతాడివాడ జంక్షన్ వద్ద సత్యసాయి భక్తులు సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని కలిశెట్టి అప్పారావు మాస్టారు ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి ప్రతినిధులు సూరినాయుడు, పప్పల బుచ్చయ్య, వాళ్లె సూర్యనారాయణ, కరుమజ్జి పైడినాయుడు, మీసాల పైడినాయుడు, మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు. – డెంకాడ



ఒకే ఒక్క వినతి..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒకే ఒక్క వినతి వచ్చింది. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఒక వినతి రాగా సాధ్యమైనంత త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీప్లానర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం



కందివలస గెడ్డలో వ్యర్థ జలాలు..



పూసపాటిరేగ మండలంలోని కందివలస గెడ్డలో కలుస్తున్న వ్యర్థజలాలను సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు టీవీ రమణ సోమవారం పరిశీలించారు. కందివలస గెడ్డ పరిసర ప్రాంతంతో పాటు అల్లాడపాలెంలోని మినరల్ వాటర్‌ప్లాంట్‌ను సందర్శించారు. అల్లాడపాలెం గ్రామాన్ని కాలుష్యం నుంచి విముక్తి చేయాలని పరిశ్రమ యాజమాన్యాలను ఈ సందర్భంగా ఆయన కోరారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు బి.సూర్యనారాయణ, బి.గురునాయుడు, తదితరులు వున్నారు. – పూసపాటిరేగ

ఇండస్ట్రియల్ విజిట్..



సీతం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యార్థులు బెంగళూర్‌లోని అక్షయ పాత్ర ఫౌండేషన్‌ను సోమవారం సందర్శించారు. ఈ మేరకు తాము అందించే సేవా కార్యక్రమాలను ఫౌండేషన్ ప్రతినిధులు వివరించారు.

– విజయనగరం అర్బన్

ఘనంగా శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం


పట్టాభిషేకం జరిపిస్తున్న అర్చకులు

- రామతీర్థంలో ముగిసిన కల్యాణ వసంతోత్సవం

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించిన మరుసటిరోజు దేవస్థానంలో స్వామి వారికి సామ్రాజ్య పట్టాభిషేకం జరిపించడం ఆనవాయితీ. ఉత్సవంలో భాగంగా వేకువ జామున 5 గంటల నుంచి స్వామి వారికి ఆరాధన, బాలభోగం, ఆరగింపు, మంగళాశాసనం, తీర్థగోష్ఠి తదితర కార్యక్రమాలను అర్చకులు చేపట్టారు. 9 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం జరిపించారు. 10 గంటలకు రామచంద్ర ప్రభువు పట్టాభిషేక మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం రుత్వికులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. 11.30 గంటలకు రాజభోగం నివేదన, మంగళాశాసనం జరిపించారు. సోమవారం నాటితో దేవస్థానంలో కళ్యాణ వసంతోత్సవాలు ముగిశాయి. పూజాకార్యక్రమాలను ఆలయ ఈఓ వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలి

- డీఎంహెచ్‌ఓ జీవనరాణి


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలని డీఎంహెచ్‌ఓ ఎస్ .జీవనరాణి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని సోమవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవిష్యత్‌ను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం, వాకింగ్, యోగా, ధ్యానం చేయాలన్నారు. సమతుల ఆహారం, తగినంత నీరు తీసుకోవాలని సూచించారు. అలాగే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ పీఓ డాక్టర్ వీవీబీ సుబ్రహ్మణ్యం, డీఎంఓ వై. మణి, డెమో చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.